సాక్షి
మెదక్
మంగళవారం। 18। ఏప్రిల్। 2023

ఇమాంపూర్‌లో కార్డన్ సెర్చ్

తూప్రాన్: అనుమానితుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఇమాంపూర్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని 60 ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి సమస్య ఉన్నా 100కు డయల్ చేయాలని సూచించారు.



స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం

తూప్రాన్ పట్టణ కేంద్రంలోని స్క్రాప్ దుకాణంలో ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. సుమారు రూ. 20 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగింది.


8లో



ఎండలోనే రోగులకు వైద్యం

కొల్చారం మండలంలోని రంగంపేట పీహెచ్‌సీలో రోగులు అవస్థలు పడుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో మరమ్మతులు జరుగుతున్నాయని ఎండలోనే వైద్యం చేస్తున్నారు.

9లో



న్యూస్‌రీల్

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: మండల బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం మంగళవారం ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి చెప్పారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మంగళవారం ఉదయం 11 గంటలకు పట్టణంలోని సాయి కృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఉంటుందన్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన కార్యకర్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. అలాగే రంజాన్‌ను పురస్కరించుకుని నర్సాపూర్‌లో నేడు ఇఫ్తార్ ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో ఆత్మ కమిటీ చైర్మన్ గౌరి వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ బబియానాయక్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ నయిమోద్దీన్, నాయకులు నర్సింగ్‌రావు, శేఖర్, హబీబ్‌ఖాన్, శ్రీరాములు, వెంకటేష్‌గౌడ్, సామ్యానాయక్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

కబ్జా భూముల పరిశీలన




కబ్జాకు గురైన భూమిని పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

రామాయంపేట(మెదక్): 'దర్జాగా..కబ్జా' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ అబ్దుల్ మన్నాన్, ఆర్‌ఐ రాజు లక్ష్మాపూర్, తొనిగండ్ల శివారులో కబ్జాకు గురైన అసైన్డ్ భూములను పరిశీలించారు. జేసీబీల సహాయంతో గుట్టలను తవ్వి చదువు చేస్తున్న విషయమై స్పందించిన అధికారులు పనులు నిలిపి వేయించారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ సాయిరాం పేర్కొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



సమీక్ష నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్

నర్సాపూర్: తడి, పొడి చెత్తతో పాటు హానికర చెత్తను వేరు చేసి ఇచ్చే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సిబ్బందితో పాటు సాంస్కృతిక సారథి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని ఆయా వార్డుల్లో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించేందుకు వార్డుల వారీగా ప్రణాళిక రూపొందించినట్టు వివరించారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పట్టాలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సాపూర్: నత్నాయిపల్లి గ్రామ పరిధి ధర్మారంలో కబ్జాలో ఉండి సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని తెలంగాణ పీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం పలువురు రైతులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్మారంలో సుమారు 630 ఎకరాల భూములపై సమగ్ర విచారణ జరిపి పేద రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఆయన వెంట ఉదయ్‌కుమార్, శ్రీనివాస్, రైతులు, తదితరులు ఉన్నారు.

భానుడి భగభగ

పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు
- ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- అత్యవసరమైతేనే బయటకు రావాలి: వైద్యులు

ఐదు రోజులుగా జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు

తేదీ	కనిష్టం	గరిష్టం
12	21.2	40.3
13	21.2	41.4
14	21.9	40.8
15	20.7	38.7
16	19.9	41.8

మెదక్‌జోన్: వారం రోజులుగా జిల్లావ్యాప్తంగా ఎండలు దంచి కొడుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలకు చేరుకున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. సాయంత్రం ఐదు గంటల వరకు ఉక్కపోత ఎండ వేడిమితో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్నం వేళ రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతుండగా.. ఎండ నుంచి ఉపశమనం కోసం ప్రజలు చల్లటి పానీయాలు, కొబ్బరి నీళ్లు సేవిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని వైద్యులు సూచిస్తున్నారు. తప్పనిసరి అయితే తెల్లటి, వదులుగా ఉండే కాటన్ వస్త్రాలు ధరించి, గొడుగుతో బయటకు రావాలని చెబుతున్నారు.



మెదక్‌లో నిర్మానుష్యంగా మారిన రోడ్డు



ఎండ నుంచి ఉపశమనం కోసం కొబ్బరి నీళ్లు తాగుతున్న జనం

వృద్ధులు, పిల్లలు జాగ్రత్త



పగటి ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతుండడంతో వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, పిల్లలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయటకు రావొద్దు. తాగునీరు సమృద్ధిగా తాగుతూ కొబ్బరి నీళ్లు, జ్యూస్‌లు లాంటివి తీసుకోవాలి. వడదెబ్బకు లోనైతే వెంటనే తడిబట్టతో ఒళ్లంతా తుడిచి వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తరలించాలి.

– పీసీ శేఖర్, డీసీహెచ్



సమీక్ష నిర్వహిస్తున్న, కలెక్టర్ రాజర్షిషా, పక్కన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

త్వరలో రెండో విడత గొర్రెల పంపిణీ

కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: నేటి నుంచి అవగాహన కార్యక్రమాలు చేపట్టి రెండో విడత గొర్రెల పంపిణీ లబ్ధిదారుల ఎంపిక చేయాలని కలెక్టర్ రాజర్షిషా మండల ప్రత్యేక అధికారులు, పశు సంవర్ధక శాఖ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి అధికారులకు విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెండవ విడతలో 6,195 మంది లబ్ధిదారులకు యూనిట్ల పంపిణీ లక్ష్యమన్నారు. మండల ప్రత్యేక అధికారుల చెక్‌లిస్ట్ ప్రకారం మండలస్థాయిలో ప్రజాప్రతినిధులు, గొర్రెల కాపరులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లబ్ధిదారుడు తన వాటా సొమ్ము 43,750ను వర్చువల్ ఐడీ ద్వారా నేరుగా కలెక్టర్ ఖాతాకు బదిలీ చేయాలన్నారు. గొర్రెల పంపిణీ సంబంధించి 10 రకాల రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని సూచించారు.

గడువులోగా లక్ష్యం పూర్తి చేయాలి

పెండింగ్ బియ్యం వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షిషా మిల్లర్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో రబీ సీజన్‌కు సంబంధించి (2021–22) బియ్యం డెలివరీ, పెండింగ్ క్లియరెన్స్‌పై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రబీ బియ్యం డెలివరీకి ఏప్రిల్ 30 తుది గడువని ఆలోగా లక్ష్యం పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా నుంచి ఎఫ్‌సీఐలో బియ్యం డెలివరీని తిరస్కరిస్తున్నారని ఎఫ్‌సీఐ డీఎం వివేక్ అగర్వాల్‌కు వివరించారు. జిల్లా రైస్ మిల్లర్ల సమస్యలను ప్రస్తావిస్తూ త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అనంతరం దళిత బంధు యూనిట్ల అమలు, ప్రగతిపై సంబంధిత అధికారులు, లబ్ధిదారులతో సమీక్షించారు. జిల్లాలో 256 దళిత బంధు యూనిట్లు మంజూరు కాగా 10 పౌల్ట్రీ యూనిట్లు మినహా అన్ని యూనిట్లు గ్రౌండ్ అయ్యాయని తెలిపారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

పవిత్ర మాసం రంజాన్



ఇఫ్తార్‌లో డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

మెదక్‌జోన్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పట్టణంలోని క్రిస్టల్ గార్డెన్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈసందర్భంగా డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. రంజాన్ ఎంతో పవిత్రమైందని అన్నారు. ముస్లింలు ఇఫ్తార్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పీసీసీ నాయకులు మామిళ్ల ఆంజనేయులు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్ అప్ప, నాయకులు గూడూరి ఆంజనేయులు గౌడ్, గోవింద్, శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరించి.. భరోసా కల్పించి



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి భరోసా కల్పించారు. గత నెల 21వ తేదీన మంత్రాల నెపంతో మా గ్రామానికి చెందిన కొందరు విచక్షణ రహితంగా కొట్టారని.. నా భర్త అడ్డు వస్తే పెట్రోల్ పోసి తగులబెడతామని బెదిరించారని చేగుంట మండలం బోనాల గ్రామానికి చెందిన తుప్పటి రామవ్వ ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన జరిగిన నాటి నుంచి మాతో చుట్టుపక్కల వారు ఎవరూ మాట్లాడడం లేదని వాపోయింది. స్పందించిన ఎస్పీ చట్ట ప్రకారం తగిన న్యాయం చేయాలని తూప్రాన్ డీఎస్పీకి సూచించారు. పొలం విక్రయించనని చెప్పినందుకు సమీప బంధువులు నన్ను, నా కూతురు, మనువడిపై దాడిచేసి కొట్టారని చిలప్‌చెడ్ మండలం ఫైజాబాద్‌కు చెందిన మినుపూరు సుశీల ఫిర్యాదు చేసింది. చట్టప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయం చేయాలని నర్సాపూర్ సీఐకి ఎస్పీ సూచించారు. అలాగే జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో సోమవారం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్పీ కంటి పరీక్షలు చేయించుకున్నారు.

పాత నేరస్తులపై నిఘా పెట్టాలి

కౌడిపల్లి(నర్సాపూర్): పాత నేరస్తులపై గట్టి నిఘా ఉంచాలని ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని సిబ్బందికి సూచించారు. సోమవారం రాత్రి కౌడిపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

'ఓపెన్' పరీక్షలు సజావుగా నిర్వహించాలి

మెదక్ కలెక్టరేట్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఈనెల 25 నుంచి మే 4 వరకు నిర్వహించే పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పదో తరగతిలో 466 మంది, ఇంటర్మీడియట్‌లో 969 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. సందేహాలకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని.. 08542–295622 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఈఓ రాధాకిషన్, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ రామేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సీల్డ్ టెండర్ల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని మైనార్టీ గురుకుల హాస్టళ్లకు 2023– 24లో కిరాణం, ఇతర నిత్యావసర సరుకుల సరఫరా చేసేందుకు సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నామని అదనపు కలెక్టర్ రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24 నుంచి 29 వరకు టెండర్ ఫారాలను మైనార్టీ కార్యాలయంలో పొందాలన్నారు. మే 3వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా టెండర్లు దాఖలు చేయాలన్నారు. మే 5న అదనపు కలెక్టర్ సమక్షంలో టెండర్లు తీస్తామని చెప్పారు. పూర్తి సమాచారం కోసం మైనార్టీ సంక్షేమాధికారిని సంప్రదించాలని సూచించారు.

పర్యవేక్షణ లేకనే విద్యార్థుల మృత్యువాత

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం



మట్లాడుతున్న మాణిక్యం

కొండాపూర్(సంగారెడ్డి): ఆర్సీఓల పర్యవేక్షణ లేకపోవడంతోనే గురుకులాల్లో విద్యార్థులు చనిపోతున్నారని, ఆయా ఘటనలపై సమగ్ర విచారణ జరపాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డిలోని కేవీపీఎస్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ ఇటీవల నారాయణఖేడ్ గిరిజన గురుకులంలో విద్యార్థి అదృశ్యమై చెరువులో శవమై తేలాడని, సిర్గాపూర్ ఎస్టీ గురుకులంలో ఇంటర్ విద్యార్థిని రెండంతస్తుల పైనుంచి పడి చనిపోయిందని, సిర్గాపూర్ మైనార్టీ గురుకులంలో ఇంటర్ విద్యార్థిని గర్భం దాల్చిందని, గతంలో ముత్తంగి మహాత్మ జ్యోతిబాపూలే గురుకులంలో ఇంటర్ విద్యార్థిని చనిపోయిందని గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ఆర్సీఓల పర్యవేక్షణ ఏమైందని ప్రశ్నించారు. సంబంధిత ఆర్సీఓలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీడు భూములు సస్యశ్యామలం



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత

మనోహరాబాద్(తూప్రాన్): సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మిషన్ కాకతీయ పనులతో చెరువులు, కుంటలు నిండి బీడు భూములు సస్యశ్యామలం అవుతున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతా శేఖర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని గౌతోజీగూడెంలో రూ. 20 లక్షలతో చేపట్టిన మిషన్ కాకతీయ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ శ్రీకాంత్, ఏఈ అనురాధ, ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, నాగభూషణం, ఉపసర్పంచ్ రేణుకుమార్, కార్యదర్శి నందిని, సిబ్బంది రాజు, వార్డు సభ్యులు, నాయకులు నర్సింలు, కృష్ణ, లక్ష్మీనారాయణ, సాయిలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు

కలెక్టరేట్ ఎదుట వీఓఏల నిరసన

మెదక్ కలెక్టరేట్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఓఏలు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 17 రోజులుగా జిల్లావ్యాప్తంగా నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ యాదగిరిరెడ్డి

చేగుంట(తూప్రాన్): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం గొల్లపల్లిలో కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఏటీఎం కార్డుల నంబర్లు, ఇతర ఓటీపీలు ఫోన్‌చేసి అడిగితే చెప్పకూడదన్నారు. రోడ్డు ప్రమాదాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని.. గ్రామాల్లో జరిగే సంఘటనలపై పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. దొంగతనాల నివారణ, నేరాలను అదుపునకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఇందుకోసం గ్రామస్తుల సహకారంతో నిధి సేకరణ జరిపినట్టు చెప్పారు. శాంతియుత వాతావరణంలో ప్రజలు జీవించేందుకు ప్రయత్నించాలని.. గొడవలు, పగలతో సాధించేది ఏమీ లేదని అన్నారు. కార్యక్రమంలో రామాయంపేట సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, చేగుంట ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో పరిష్కరించాలి


- కలెక్టర్ రాజర్షిషా
- ప్రజావాణికి 89 వినతులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్డీఓ శ్రీనివాస్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి 89 వినతులు రాగా.. ప్రధానంగా ధరణి, భూ సమస్యలు, డబుల్ బెడ్రూం ఇళ్లు, పింఛన్లు, తదితర శాఖలకు సంబంధించినవి ఉన్నాయి. వినతులను పరిశీలించిన కలెక్టర్ ఆయా శాఖలకు చెందిన అధికారులకు అందజేసి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం సత్యసాయి సేవా సంస్థ, హవేళిఘనపూర్‌కు చెందిన రాజరాజేశ్వరి బిన్నీ మోడ్రన్ రైస్‌మిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు.

కార్యదర్శి పట్టించుకోవడం లేదు



మా ఇంటి స్థలాన్ని పక్కింటి వారు ఆక్రమించి అందులో అక్రమ నిర్మాణం చేపడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. చర్యలు తీసుకోండి.

–కావేష్, మంబోజిపల్లి

పౌతి చేయిస్తామని అమ్ముకున్నారు



నా భర్త చనిపోయాడు. ఆయన పేరున ఉన్న 30 గుంటల భూమిని నాపేరుపై పట్టా చేయిస్తామని సమీప బంధువులు పబ్బండ బాలయ్య, రాజు తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లారు. నా పేరున 15 గుంటలు పట్టా చేయించారు. పాస్‌బుక్ కూడా వచ్చింది. 15 రోజుల తర్వాత ఆన్‌లైన్‌లో చూస్తే ఒక్క గుంట లేదు. దీంతో తహసీల్దార్ కార్యాలయంలో ఆరా తీస్తే అమ్ముకున్నట్టు ఉందని చెబుతున్నారు.

–బాలమణి, యశ్వంతరావుపేట

మరింత స్థలం కేటాయించాలి



అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణానికి మరింత స్థలం కేటాయించాలని కోరగా తహసీల్దార్ స్పందించడం లేదు. ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ కేటాయించడం లేదు.

–మోహన్, గడిపెద్దాపూర్

అనుమతి ఇవ్వడం లేదు



నా సొంత స్థలాన్ని రోడ్డు కోసం వదిలిపెడ్తానని చెప్పినా మున్సిపల్ కమిషనర్ ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వడం లేదు. చర్యలు తీసుకోండి.

–జితేందర్, మెదక్

దౌర్జన్యం చేస్తున్నారు



చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లి శివారులో నాకు ఎనిమిది గుంటల భూమి ఉంది. కొట్యూరి రాజిరెడ్డి, సంజయ్ అగర్వాల్ భూమిని ఆక్రమించుకుంటున్నారు. అడిగితే మాపై దాడి చేస్తున్నారు.

–దోకి లక్ష్మి, గజగట్లపల్లి

క్లుప్తంగా

డ్రంకెన్‌ డ్రైవ్‌లో మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమాన విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌లో 34 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా 33 మందికి జడ్జి రూ.2వేలు జరిమానా విధించారు. మరో వ్యక్తికి రూ.5వేలు జరిమాన విధించినట్లు ట్రాఫిక్‌ సీఐ పేర్కొన్నారు.

సిద్దిపేటకమాన్‌లో..
డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్‌ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం...పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో నాలుగు రోజుల క్రితం సిబ్బందితో డ్రంకెన్‌ డ్రైవ్‌ నిర్వహించగా 21 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సోమవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.48,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

కారులో మహిళ ప్రసవం

చిన్నశంకరంపేట(మెదక్‌): పురిటినొప్పులతో బాధపడుతున్న మహిళను ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌ సకాలంలో రాకపోవడంతో కారులో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మహిళ ప్రసవించిన సంఘటన చిన్నశంకరంపేటలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం చిన్నశంకరంపేట మండల కేంద్రానికి చెందిన ఎర్రబోయిన భాగ్యను కాన్పుకోసం మెదక్‌ ప్రభుత్వ ఆస్పత్రికి కారులో తీసుకెళుతుండగా మార్గమధ్యలోనే ప్రసవం అయింది. కుటుంబ సభ్యుల సహకారంతో ఆశ వర్కర్‌ ప్రసవం చేసింది. దీంతో ప్రాథమిక చికిత్సనంతరం తల్లి, పాపను కారులోనే మెదక్‌లోని మాత శిశు ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

మనోహరాబాద్‌(తూప్రాన్‌): కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెల వలన నష్టపోయిన బాధిత కుటుంబాన్ని తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని మెదక్‌, సిద్దిపేట్‌ జిల్లాల అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షుడు గండి మల్లేశ్‌యాదవ్‌, మామిండ్ల ఐలయ్య యాదవ్‌లు డిమాండ్‌ చేశారు. సోమవారం మనోహరాబాద్‌ మండల కేంద్రానికి చెందిన నిమ్మల చిన్న మల్లేశ్‌ను వారు పరామర్శించారు.

హరితహారం మొక్కలను కాల్చిన వ్యక్తికి జరిమానా

మద్దూరు(హుస్నాబాద్‌): హరితహారంలో నాటిన మొక్కలను కాల్చిన వ్యక్తికి రూ.3వేలు జరిమానా విధించారు. సలాఖపూర్‌ గ్రామానికి చెందిన ఏడాకుల భాస్కర్‌ రెడ్డి తన వ్యవసాయ భూమిని సాగు చేసుకునే క్రమంలో మంటలు హరితాహారం చెట్లకు అంటుకోవడంతో కొన్ని చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి కిరణ్‌ రైతుకు రూ.3వేలు జరిమాన విధించారు.

డబుల్‌ బెడ్రూం లబ్ధిదారులకు న్యాయం చేయాలి

గజ్వేల్‌రూరల్‌: అర్హులైన డబుల్‌ బెడ్రూం లబ్ధిదారులందరికీ న్యాయం చేయాలని సాధన కమిటీ కన్వీనర్‌ సందబోయిన ఎల్లయ్య డిమాండ్‌ చేశారు. సోమవారం లబ్ధిదారులతో కలిసి తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు.

వ్యక్తి అరెస్టు

బీబీపేట: పెళ్లి చేసుకుంటానని చెప్పి యువతిని మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ తిరుపయ్య తెలిపారు. సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. కామారెడ్డి జిల్లా బీబీపేట మండలానికి చెందిన ఓ యువతిని నిజాంపేట మండలం చల్మెడ గ్రామానికి చెందిన వడ్ల శివకృష్ణ పెళ్లి చేసుకుంటానని చెప్పి లొంగదీసుకున్నాడు. పెళ్లి చేసుకోవడానికి నిరాకరించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తిరుపయ్య, ఎస్సై సాయికుమార్‌ తెలిపారు.

అధికారుల నిర్వాకంతో అసౌకర్యం

దివ్యాంగులకు సభా వేదికగా మంత్రి హరీశ్‌ రావు క్షమాపణలు


బ్యాటరీ ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి హరీశ్‌ రావు

సిద్దిపేటజోన్‌: జిల్లా అధికారి అత్యుత్సాహం వల్ల మీకు అసౌకర్యం కల్గింది. వారి పక్షాన రెండు చేతులు జోడించి క్షమించాలని కోరుతున్న అంటూ రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌ రావు దివ్యాంగులకు సభవేదిక ద్వారా క్షమాపణ కోరారు. సిద్దిపేట బాలసదనంలో రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్‌ వాసుదేవ రెడ్డితో కలిసి వికలాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మంత్రి పర్యటన షెడ్యూల్‌ను సంబంధిత శాఖ అధికారులు మధ్యాహ్నం మూడు గంటలకు సమయం కేటాయించారు. కానీ అధికారులు లబ్ధిదారులను ఉదయం 10 గంటలకు నిర్దేశిత సభా స్థలానికి తీసుకొచ్చారు. మంత్రి బిజీ షెడ్యూల్‌ వల్ల నిర్ణీత సమయం 3 గంటలకు బదులుగా అరగంట ఆలస్యంగా వచ్చారు. రాగానే గంటల తరబడి వేచి చూస్తున్నారనే విషయం తెలుసుకున్న మంత్రి ముందుగా లబ్ధిదారులైన వికలాంగులకు చేతులు జోడించి క్షమాపణ చెప్పారు. అధికారుల అత్యుత్సాహం, వారి నిర్వాకం వల్ల మీరు వేచి ఉండే పరిస్థితిని తెచ్చారన్నారు. మిమ్మల్ని నిర్ణీత సమయం కంటే ముందుగా పిలిచి ఇబ్బందులు పెట్టిన అధికారుల తరుపున మంత్రి హరీశ్‌రావు చేతులు జోడించి క్షమాపణలు కోరారు. భవిష్యత్తులో ఇలా వికలాంగులకు ఇబ్బందులు పెట్టొద్దన్నారు. అనంతరం 150 మంది వికలాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపత్‌ రెడ్డి, నర్సింగ్‌ కౌన్సిల్‌ సభ్యులు సాయిరాం, నాయకులు ఆనంద్‌, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

దొరికిన పర్సు పోలీసులకు అప్పగింత

నర్సాపూర్‌రూరల్‌: బస్సులో దొరికిన పర్సును తోటి ప్రయాణికుడు పోలీస్‌ స్టేషన్లో అప్పగించాడు. నర్సాపూర్‌ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 15న హైదరాబాద్‌ నుంచి బోధన్‌ వెళ్లే బస్సులో ఓ ప్రయాణికుడు పర్సు పోగొట్టుకున్నాడు. అదే బస్సులో ప్రయాణిస్తున్న బ్రాహ్మణపల్లికి చెందిన పాత్‌లోత్‌ అనిల్‌కు పర్సు దొరికింది. అందులో రూ.5వేల నగదు, డెబిట్‌, క్రెడిట్‌కార్డులు ఉన్నాయి. వాటిని అనిల్‌ నర్సాపూర్‌ పోలీస్‌ స్టేషన్లో అప్పగించి తన వివరాలు అందజేశాడు. పోలీసులు పర్సులో ఆధారాలను బట్టి బాధితునికి ఫోన్‌చేసి పర్సు అప్పగించారు. బ్రాహ్మణపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌ ఉపాధ్యాయులు నిజాయితీని చాటుకున్న అనిల్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌, జెత్యా, హైదర్‌ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం కేసులో ఒకరికి ఏడేళ్ల జైలు

కామారెడ్డి క్రైం: బాలికను అత్యాచారం చేసిన కేసులో ఒకరికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ కామారెడ్డి పోక్సో కోర్టు సోమవారం తీర్పు వెల్లడించింది. వివరాలిలా ఉన్నాయి. మెదక్‌ జిల్లాలోని ప్రగతి(దొంగల) ధర్మారం గ్రామానికి చెందిన బొజ్జా రవి బీబీపేటలోని తన సోదరి ఇంటికని వచ్చి ఇక్కడే పనులు వెతుక్కుని నివసించేవాడు. గతేడాది ఫిబ్రవరిలో బీబీపేటలోని ఓ ఆలయం వద్ద ఆడుకుంటున్న ఎనిమిదేళ్ల బాలికకు చాక్లెట్లు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి తాను ఉంటున్న ఇంటికి తీసుకెళ్లి, అత్యాచారం చేశాడు. స్థానికులు నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కేసును విచారించిన కామారెడ్డి పోక్సో కోర్టు న్యాయమూర్తి లాల్‌ సింగ్‌ నాయక్‌ సోమవారం తీర్పు ఇచ్చారు. నిందితుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.ఐదు వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు మొక్కజొన్న దగ్ధం

కోహెడరూరల్‌(హుస్నాబాద్‌): ప్రమాదవశాత్తు విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ నుంచి మంటలు వచ్చి మొక్కజొన్న పంట దగ్ధమైన ఘటన మండలంలోని తీగలకుంటపల్లిలో చోటుచేసుకుంది. మూల రాజిరెడ్డి మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. సోమవారం విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ నుంచి నిప్పురవ్వలు పడి చేతికొచ్చే దశలో మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. దీంతో 150స్ప్రింక్లర్‌ పైపులు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనలో సుమారు 3లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని రైతు రాజిరెడ్డి కుటుంబసభ్యులు రోదిస్తున్నారు.ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని సర్పంచ్‌ మ్యాకల చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్‌ చేశారు.



అదృశ్యమైన వ్యక్తి .. శవమై ఇంటికి..

పాపన్నపేట(మెదక్‌): విదేశాలకు వెళ్లే క్రమంలో ఏజెంటును కలవడానికని ఇంట్లో చెప్పి వెళ్లిన వ్యక్తి శవమై ఇంటికి వచ్చిన విషాద సంఘటన పాపన్నపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సోమవారం ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం..పాపన్నపేటకు చెందిన పోచమ్మకాడి రమేశ్‌(38) బెస్త పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. విదేశాలకు వెళ్లి డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో విదేశి ప్రయాణానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 10న ఏజెంటును కలుస్తానని ఇంట్లో చెప్పి ఢిల్లీకి వెళ్లిన వ్యక్తి మరుసటి రోజు ఇంటికి ఫోన్‌ చేసి కుటుంబ సభ్యులతో మాట్లాడాడు. అనంతరం తన ఫోన్‌ స్విచ్‌ఆఫ్‌ అయ్యింది. అప్పటి నుంచి రమేశ్‌ ఆచూకీ కోసం ఎంత ప్రయత్నించినా లభ్యం కాలేదు. దీంతో కుటుంబ సభ్యులు మార్చి 17న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రమేశ్‌ ఫోన్‌ నంబర్‌ ఆధారంగా లోకేషన్‌ ట్రేస్‌ చేశారు. మధ్యప్రదేశ్‌లోని మోరేనా పట్టణంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి వద్ద రమేశ్‌ సెల్‌ఫోన్‌ ఉన్నట్లు గుర్తించారు. స్థానిక పోలీసులు అక్కడికి వెళ్లి విచారించగా రమేశ్‌ ఫోన్‌ను ఓ వ్యక్తి కొనుగోలు చేసి వాడుతున్నట్లు తెలుసుకున్నారు. అక్కడి పోలీసులతో కలిసి విచారణ చేయగా మార్చి 13 నుంచి ఒంటిపై దుస్తులు లేకుండా పిచ్చోడిలా తిరుగాడాడని, మూర్చతో చనిపోయినట్లు వారు తెలిపారు. దీంతో అక్కడి స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. గుర్తుతెలియని మృతదేహంగా పోలీసులు అక్కడే పూడ్చివేయించినట్లు తెలిపారు. పాపన్నపేట పోలీసులు రమేశ్‌కు చెందిన వివరాలతో, ఆధారాలను చూపడంతో మృతదేహాన్ని వెలికితీయించి సోమవారం పాపన్నపేట్‌కు తీసుకొచ్చినట్లు తెలిపారు. కాగా మృతిపై మధ్యప్రదేశ్‌ పోలీసులు ఆరా తీస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


రమేశ్‌(ఫైల్‌)

అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యాయత్నం

జహీరాబాద్‌: అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకునేందుకు అటవీ ప్రాంతంలో విషం సేవించిన యువకుడిని పోలీస్‌ కానిస్టేబుల్‌ జైపాల్‌ భుజాలపై మోసుకొచ్చి ఆస్పత్రికి తరలించి ప్రాణం కాపాడాడు. వివరాల్లోకి వెళితే...జహీరాబాద్‌ మండలంలోని అల్గోల్‌ గ్రామానికి చెందిన రాజు(27)అనే యువకుడు ఆదివారం రాత్రి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెల్లెలు మహేశ్వరికి మెసేజ్‌ పెట్టాడు. దీంతో కంగారు పడిన చెల్లెలు వెంటనే 100 నెంబర్‌కు కాల్‌ చేసి విషయాన్ని చేరవేసింది. డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్‌ జైపాల్‌ ఎస్‌ఐకి సమాచారం ఇచ్చి అల్గోల్‌ గ్రామానికి వాహనంపై డ్రైవర్‌తో కలిసి వెళ్లాడు. గ్రామంలోని పాఠశాల భవనం వెనకాల ఉన్న అటవీ ప్రాంతంలోకి నెట్‌వర్క్‌ ఆధారంగా బాధితుడి చెల్లెలు, గ్రామస్తుడి సహాయంతో అటవీ ప్రాంతంలోకి కాలినడకన వెళ్లారు. విషం సేవించి ఉన్న రాజును సుమారు కిలోమీటర్‌ దూరం మేర కానిస్టేబుల్‌ వాహనం వరకు జైపాల్‌భుజంపై మోసుకొచ్చి ఆస్పత్రికి తరలించాడు. సకాలంలో వైద్యం అందడంతో రాజు ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. ప్రథమ చికిత్స అనంతరం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సకాలంలో స్పందించి ఓ నిండు ప్రాణాన్ని కాపాడిన కానిస్టేబుల్‌ జైపాల్‌ను డీఎస్పీ రఘు, సీఐ భూపతి, ఎస్‌ఐ శ్రీకాంత్‌లు అభినందించారు. రాజు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి...
కొండపాక(గజ్వేల్‌): కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మ హత్యకు పాల్పడ్డ ఘటన త్రీటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. త్రీ టౌన్‌ సీఐ భానుప్రకాశ్‌ తెలిపిన వివరాల ప్రకారం..త్రీటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని సిర్సనగండ్ల గ్రామానికి చెందిన సంకటాల యాదగిరి(35)హమాలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడన్నారు. తరుచూ కుటుంబంలో గొడవలు జరుగుతుండటంతో తాగుడుకు బానిసై సోమవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తూప్రాన్‌: పట్టణంలోని కరీంగూడ సమీపంలో పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు ఎస్‌ఐ సురేశ్‌కుమార్‌ దాడులు నిర్వహించినట్లు సోమవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం..కరీంగూడకు సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం తెలుసుకొని సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.21,840లను స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేపట్టామన్నారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు

మెదక్‌ మున్సిపాలిటీ: గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనానికి నిప్పంటించి కాల్చివేసిన ఘటన మెదక్‌ పట్టణం సుభాష్‌ నగర్‌లో ఆదివారం రాత్రి జరిగింది. మెదక్‌ పట్టణ ఎస్‌ఐ మల్లారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మెదక్‌ పట్టణం సుభాష్‌ నగర్‌కు చెందిన బింగరి లక్ష్మణ్‌ తన మోపెడ్‌ ద్విచక్ర వాహనాన్ని ఇంటి ఆవరణలో ఆదివారం పార్క్‌ చేసి ఉంచాడు. సోమవారం ఉదయం చూసే సరికి కాల్చి వేసినట్లు ఉందన్నారు. ఈ మేరకు పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ మల్లా రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారన్నారు.

భగవంతుని స్మరణతోనే సంతోషం

కంగ్టి(నారాయణఖేడ్‌): భగవంతుడు అందని వాడు కాదు..అందరివాడుగా తలిచి నిత్యం స్మరిస్తూ ఉండడంతో సంతోషం కలుగుతోందని రంగంపేట పీఠాధిపతి, యతీశ్వరులు శ్రీ మాధవనంద సరస్వతీ స్వామి ఉద్బోధించారు. సోమవారం కంగ్టి మండలంలోని రాంతీర్థం గ్రామంలో శ్రీరామాలయంలో జిల్లా బ్రాహ్మణసంఘం నిర్వహించిన 5వ యశస్సు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రవచనం చేశారు. గ్రామాల్లో అన్నీ కులాలవారు వర్గవిభేదాలు మాని దైవనామస్మరణలో ఉండాలన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని భర్త ఆత్మహత్య

రామాయంపేట(మెదక్‌): భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్థాపానికి గురైన యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన సోమవారం రామాయంపేటలో వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రంజిత్‌ తెలిపిన వివరాల ప్రకారం ...పట్టణానికి చెందిన ఎరుకల రవి భార్య గతంలో తల్లిగారింటికి వెళ్లి మళ్లీ రాలేదు. దీంతో రవి పలుమార్లు పెద్ద మనుషులతో చెప్పించినా ఫలితం లేదు. మనస్థాపానికి గురైన రవి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడిని బలితీసుకున్న బండరాయి

● ఇంటి రేకులపై కోతులు దూకడంతో ఘటన

అక్కన్నపేట(హుస్నాబాద్‌): వంటగదిపై ఉన్న రేకులు గాలికి లేవకుండా ఉండేందుకు పెట్టిన బండరాళ్లు బాలుడిని బలి తీసుకున్నాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కట్కూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన దేవునూరి శ్రీకాంత్‌–రజిత దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడు అభినయ్‌(2) వంటగదిలో తల్లి దగ్గర ఆడుకుంటున్నాడు. అయితే.. వంటగది పైకప్పు రేకులు గాలివానకు లేవకుండా ఉండేందుకు బండరాళ్లు పెట్టారు. ఇంటికి, వంటగదికి మధ్యలో కొంచెం గ్యాప్‌ ఉండడంతో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా కోతుల గుంపు వంటగదిపైకి చేరాయి. అవి ఇటూ ఇటూ దూకడంతో రేకులపై ఉన్న బండరాళ్లు.. తల్లి పక్కనే ఆడుకుంటున్న బాలునిపై పడ్డాయి. దీంతో బాలుడు మృతి చెందాడు.


దేవునూరి అభినయ్‌ (ఫైల్‌)

గుండెపోటుతో ఫీల్డ్‌ అసిస్టెంట్‌ మృతి

కోహీర్‌(జహీరాబాద్‌): గుండెపోటుతో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ ఫీల్డ్‌ అసిస్టెంట్‌ మృతి చెందిన ఘటన కోహీర్‌ మండలం, బిలాల్‌పూర్‌లో చోటు చేసుకుంది. ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం ఉదయం గుండెపోటు రావడంతో తీవ్ర అస్వస్థతకు గురైన మోజెస్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మోజెస్‌ మరణించాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


మోజెస్‌ (ఫైల్‌)

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మనోహరాబాద్‌(తూప్రాన్‌): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మనోహరాబాద్‌ మండలం, కాళ్లకల్‌ గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..55 నుంచి 60 సంవత్సరాల వ్యక్తి మృతదేహం కాళ్లకల్‌లో లభ్యమైందన్నారు. గ్రామ కార్యదర్శి శంకర్‌గౌడ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని తూప్రాన్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

వ్యాన్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

తప్పిన ప్రమాదం

పెద్ద శంకరంపేట(మెదక్‌): పెద్ద శంకరంపేట మండల పరిధిలోని చీరాపల్లి క్రాస్‌ రోడ్‌ వద్ద ఎదురుగా వస్తున్న నారాయణఖేడ్‌ డిపో ఆర్టీసీ బస్సు మూలమలుపు వద్ద సంస్కార్‌ విద్యాలయ పాఠశాలకు చెందిన వ్యాన్‌ను సోమవారం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరేపల్లికి చెందిన కృష్ణమోహన్‌ అనే విద్యార్థికి స్వల్ప గాయాలు అయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్సలు నిర్వహించారు. వ్యాన్లో పదిమంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారన్నారు. కాగా విద్యార్థి బంధువులు పాఠశాల యాజమాన్యం నారాయణఖేడ్‌ డిపో బస్సుపై పెద్ద శంకరంపేట పోలీస్‌ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఫిర్యాదులను సీఈఐఆర్‌ యాప్‌లో నమోదుచేయాలి

సిద్దిపేట అడిషనల్‌ డీసీపీ అడ్మిన్‌ మహేందర్‌

సిద్దిపేటకమాన్‌: సెల్‌ఫోన్‌ పోయిందని వచ్చే ఫిర్యాదులను సీఈఐఆర్‌ యాప్‌లో నమోదు చేయాలని సిద్దిపేట అడిషనల్‌ డీసీపీ అడ్మిన్‌ మహేందర్‌ పోలీస్‌ సిబ్బందికి సూచించారు. పోలీస్‌ కమిషనర్‌ కార్యాలయంలో రిసెప్షనిస్టులకు(సీఈఐఆర్‌) సెంట్రల్‌ ఎక్విప్‌మెంట్‌ ఐడెంటిటీ రిజిస్టర్‌ యాప్‌పై సోమవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్‌ డీసీపీ అడ్మిన్‌ మహేందర్‌ మాట్లాడుతూ..ప్రస్తుత జీవన శైలిలో మొబైల్‌ ఫోన్‌ అత్యంత కీలకంగా మారిందన్నారు. ఏవరైనా సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటే దాన్ని గుర్తించడానికి పోలీసులు ఇప్పటికే పలు రకాల టెక్నాలజీ వాడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సీఈఐఆర్‌ యాప్‌ ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను గుర్తించొచ్చన్నారు. పోయిన సెల్‌ఫోన్‌ పూర్తి వివరాలు ఈ యాప్‌లో నమోదు చేయడం ద్వారా దాన్ని బ్లాక్‌ చేస్తారు. దీంతో అది పనిచేయదు. తిరిగి అది దొరికిన తర్వాత ఆన్‌లైన్‌లో ఈ యాప్‌ ద్వారా అన్‌బ్లాక్‌ చేయడంతో ఆఫోన్‌ తిరిగి పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ సెల్‌ శ్రీకాంత్‌, కానిస్టేబుల్‌ రమేశ్‌ పాల్గొన్నారు.


నూతన యాప్‌ గురించి మాట్లాడుతున్న అడిషనల్‌ డీసీపీ అడ్మిన్‌ మహేందర్‌

భగత్‌సింగ్‌ విగ్రహ నిర్మాణాన్ని అడ్డుకోవడం సరికాదు

గజ్వేల్‌రూరల్‌: భగత్‌సింగ్‌ విగ్రహ నిర్మాణాన్ని అడ్డుకోవడం సరికాదని భగత్‌సింగ్‌ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు, విద్యార్థి, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు పేర్కొన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలోని ఐవోసీ(ఇంటిగ్రేటెడ్‌ ఆఫీస్‌ కాంప్లెక్స్‌) సమీపంలోని టీ జంక్షన్‌ వద్ద భగత్‌సింగ్‌ విగ్రహ నిర్మాణ పనులను మున్సిపల్‌ పాలకవర్గం, అధికారులు అడ్డుకోవడాన్ని ఖండిస్తూ హైకోర్టును వారు ఆశ్రయించారు. దీంతో ఆ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టొద్దని హైకోర్టు స్టే ఇచ్చినట్లు వారు తెలిపారు. మున్సిపల్‌ అనుమతులు పొందిన తర్వాత భగత్‌సింగ్‌ విగ్రహ నిర్మాణ పనులను చేపట్టగా మున్సిపల్‌ అధికారులు, పాలకవర్గ సభ్యులు అడ్డుకొని నిర్మాణాలను తొలగించడం సరికాదని, ఇది స్వాతంత్య్ర సమరయోధులను అవమాన పర్చడమేనన్నారు. ఈ కార్యక్రమంలో భగత్‌సింగ్‌ విగ్రహ కమిటీ సభ్యులు రమణాకర్‌, వినోద్‌, బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు ఓంప్రకాశ్‌, బీజేపీ గజ్వేల్‌ నియోజకవర్గ కోకన్వీనర్‌ సురేశ్‌, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్‌యాదవ్‌, మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు కృపానందం, ఎమ్మార్పీఎస్‌ నాయకుడు ముంద్రాతి కృష్ణ, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు కరుణాకర్‌, ఇన్‌చార్జి నరేశ్‌తో పాటు ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.


హైకోర్టు ఇచ్చిన స్టే కాపీని అందజేస్తున్న భగత్‌సింగ్‌ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు

ఏడుపాయల్లో నీట మునిగి వ్యక్తి మృతి

పాపన్నపేట(మెదక్‌): ఏడుపాయల వనదుర్గ ప్రాజెక్టు వద్ద నీటిలో మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ విజయ్‌ కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం... టేక్మాల్‌ మండలం ఎల్లంపల్లి గ్రామానికి చెందిన వడ్డెర హన్మంతు(72)కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం దుర్గామాత దర్శనానికి ఏడుపాయలకు కుటుంబ సభ్యులతో వచ్చాడు. అక్కడ హన్మంతు ప్రసాదం తిని చేతులు కడుక్కోవడానికి ప్రాజెక్టులోకి దిగాడు. ప్రమాదవశాత్తు నీటిలోకి జారి మునిగిపోయాడు. కుటుంబీకులు నీటిలో ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం మృతదేహం నీటిలో తేలుతూ కనిపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి కొడుకు భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్‌ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.


హన్మంతు (ఫైల్‌)

అత్యాచారం కేసులో తండ్రికి జీవిత ఖైదు

పటాన్‌చెరు టౌన్‌: కూతురిపై తండ్రి అత్యాచారం చేసిన కేసులో స్పెషల్‌ పోక్సో ఎఫ్‌టీఎస్‌ కోర్టు న్యాయమూర్తి జీవిత ఖైదు విధించిన సంఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. అమీన్‌పూర్‌ సీఐ శ్రీనివాసులు, పీపీ అనంతరావ్‌ కులకర్ణి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...ఐలాపూర్‌ గ్రామానికి చెందిన ఓ తండ్రి 2021, ఆగస్టు 21న తల్లి ఇంట్లో లేని సమయంలో 14 సంవత్సరాల కూతురిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు. దీంతో ఆబాలిక ఫోన్లో తల్లితో జరిగిన విషయాని చెప్పింది. సమాచారం తెలుసుకున్న తల్లి అదే రోజు అమీన్‌పూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో పోలీసులు నిందితుణ్ని స్పెషల్‌ పోక్సో ఫాస్ట్‌ ట్రాక్‌ కోర్టు ముందు హాజరు పర్చగా పీపీ వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి సుదర్శన్‌ అత్యాచారానికి పాల్పడిన తండ్రికి సోమవారం జీవిత ఖైదుతో పాటు రూ. 2వేలు జరిమాన విధించింది. జరిమాన చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

శివం పేటకు వెళ్లి వస్తుండగా వెంకటాపూర్‌ గ్రామ శివారులో బుల్లెట్‌ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందాడు. బైక్‌పై వెళుతున్న యువకుడు చిన్న శంకరంపేట మండల పరిధిలో డీసీఎం ఢీకొని మృత్యువాత పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.

తూప్రాన్‌,(శివ్వంపేట): బుల్లెట్‌ అదుపు తప్పి గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన సోము ప్రశాంత్‌ (25) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్‌ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం రాత్రి తూప్రాన్‌ నుంచి దొంతికి వస్తుండగా వెంకటాపూర్‌ గ్రామ శివారు వద్ద బుల్లెట్‌ అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ఘటనలో తలకు, పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. సోమవారం అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి తెల్లవారు జామున మృతిచెందాడు. మృతుడికి 6 నెలల క్రితం దొంతి గ్రామానికి చెందిన యువతితో ప్రేమ వివాహం జరిగింది. మృతుడి తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసుకున్నట్లు ఎస్‌ఐ సురేష్‌కుమార్‌ పేర్కొన్నారు.


సోము ప్రశాంత్‌ (ఫైల్‌)

డీసీఎం ఢీకొని..
చిన్నశంకరంపేట(మెదక్‌): డీసీఎం ఢీకొన్న ఘటనలో బైక్‌పై వెళుతున్న యువకుడు మృతి చెందాడు. చేగుంట మండలం పొలంపల్లి గ్రామానికి చెందిన రాపాకుల సతీష్‌గౌడ్‌(30) ఆదివారం చిన్నశంకరంపేటకు వచ్చాడు. బైక్‌పై రాత్రి తిరిగి వెళుతుండగా, పెట్రోల్‌పంప్‌ సమీపంలోని అమిత పైప్స్‌ పరిశ్రమ వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సతీష్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. డీసీఎం డ్రైవర్‌ అజాగ్రత్తగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాష్‌గౌడ్‌ తెలిపారు. డ్రైవర్‌ పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


సతీష్‌గౌడ్‌ మృతదేహం

స్క్రాప్‌ దుకాణంలో అగ్ని ప్రమాదం

సుమారు రూ.20లక్షలకు పైగా ఆస్తి నష్టం

తూప్రాన్‌: ప్రమాదవశాత్తు స్క్రాప్‌ దుకాణానికి మంటలు అంటుకుని సుమారు రూ.20లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగిన సంఘటన పట్టణ కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. శివ్వంపేట మండలం పోతారం గ్రామానికి చెందిన ఆంజనేయులు గత కొన్నేండ్లుగా పట్టణంలో పాత ఇనుప సామగ్రి దుకాణంలో వ్యాపారం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే సోమవారం తన దుకాణ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు చెత్తను కాల్చడంతో ఆ మంటలు తమ దుకాణంలోకి వ్యాపించినట్లు బాధితుడు ఆంజనేయులు తెలిపాడు. మంటలు ఒక్కసారిగా దుకాణాన్ని చుట్టుముట్టి వ్యాపించాయి. వెంటనే పోలీసులకు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. నర్సాపూర్‌ నుంచి అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను ఆర్పేందుకు శ్రమించారు. కానీ అందులో నీళ్లు అయిపోవడంతో మున్సిపల్‌ ట్యాంకర్లతో నీళ్లను తీసుకువచ్చి మూడు గంటల శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.20లక్షలకు పైగ ఆస్థి నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.


మంటలు ఆర్పుతున్న ఫైర్‌ సిబ్బంది